క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామానికి ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేడు రానున్నట్లు మాజీ జెడ్పీటీసీ సుధాకర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు.

పరామర్శ



పరామర్శిస్తున్న జోగు రామన్న

ఎదులాపురం: పాత్రికేయుడు కత్తూరి కిరణ్ కుమార్ తండ్రి జైకుమార్ ఇటీవలే మృతి చెందారు. కాగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న శనివారం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సంతోష్‌రెడ్డి

తాంసి: మండల కేంద్రానికి చెందిన కోట్రంగి గోదావరి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. బాధితురాలి వైద్య ఖర్చుల కోసం మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి రూ.10వేల విరాళం అందజేశాడు. శనివారం బాధితురాలి ఇంటికి వెళ్లి నగదు అందజేశాడు. పేద కుటుంబానికి చెందిన మహిళకు వైద్య కోసం దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఆయన వెంట సుధాకర్, నర్సారెడ్డి, సంతోష్, మోహన్ ఉన్నారు.

పంటలను మేస్తున్న పశువులు



సోయాబీన్ మేస్తున్న పశువులు

బోథ్: మండలంలోని పలు చేనుల్లో పశువులు పంటలను మేస్తున్నాయి. విత్తనాలు విత్తిన తరువాత ఇప్పుడిప్పుడే మొలకలు వచ్చాయి. పశువులు చేనుల్లోకి వెళ్లి తినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువుల యజమానులు పశువులను రోడ్లపై, ఖాళీగా ఉన్న స్థలాల్లో వదిలేయడంతో అవి చేనుల్లోకి వెళ్లి పంటలను నాశనం చేస్తున్నాయి. పంటను తినడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. పంటను కాపాడుకోవడానికి ఉదయం నుంచి రాత్రి వరకు చేలలో కాపల ఉండాల్సి ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. పశువుల యజమానులు పశువులను రోడ్లపైకి విచిడిపెట్టకుండా చూడాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల రిలే దీక్షలు



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

కైలాస్‌నగర్: గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్‌వాడీ టీచర్లకు రూ. 2 లక్షలు, హెల్పర్స్‌కు రూ. 1 లక్ష చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలేదీక్షలు శనివారంతో 6వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో సంఘ నాయకులు సునీత, పేంటుబాయి, లత తదితరులు పాల్గొన్నారు.

హిందూవాహిని జిల్లా అధ్యక్షుడిగా నరేందర్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా హిందూవాహిని నూతన సంయోజక్ (అధ్యక్షుడు)గా జిల్లా కేంద్రానికి చెందిన గంగ్రత్ నరేందర్ ఎన్నికయ్యారు. హిందూవాహిని రాష్ట్ర సంయోజక్ ఉప్పల రాజు ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నరేందర్‌తో పాటు సహ సంయోజక్‌గా గజానన్, బాలాజీ, సచిన్, రాజు, కార్యదర్శిగా రాజును ఎన్నుకున్నారు.



నరేందర్

సుందరీకరణపై పట్టింపేది?

- ధ్వంసమవుతున్న డివైడర్ నిర్మాణాలు
- ఏళ్లు గడుస్తున్నా.. నాటని మొక్కలు
- బల్దియా నిర్వాకంపై తీవ్ర విమర్శలు



ఠాకూర్‌హోటల్ మార్గంలో నిర్మించని డివైడర్



అంబేద్కర్‌చౌక్‌లో ధ్వంసమైన డివైడర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చేపట్టిన సుందరీకరణ పనులు ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ పూర్తి కావడం లేదు. పట్టణ ప్రజలకు ఆహ్లాదంతో పాటు ఆకర్షించేలా కోట్లాది రూపాయల వ్యయంతో పట్టణంలోని ప్రధానచౌక్‌ల సుందరీకరణ చేపట్టారు. పలుచౌక్‌ల్లో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, పచ్చదనాన్ని పెంపొందించేలా వివిధ రకాల మొక్కలు నాటారు. అందంగా తీర్చిదిద్దిన పలు చౌక్‌లను అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభించారు. అయితే ఇప్పటికీ పలు చౌక్‌ల్లో సుందరీకరణ పనులు పూర్తి కాకపోగా.. చేపట్టిన నిర్మాణాలు ధ్వంసమవుతన్నాయి. కొన్ని చోట్ల అసలు నిర్మాణాలనే ప్రారంభించలేదు. దీన్ని చూసిన ప్రజలు ఇదేనా సుందరీకరణ అంటూ బల్దియా అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఏళ్లు గడుస్తున్నా..

ఎన్టీఆర్‌చౌక్ నుంచి వినాయక్‌చౌక్, వినాయక్ చౌక్ నుంచి అంబేద్కర్ చౌక్, అంబేద్కర్ చౌక్ నుంచి కిసాన్ చౌక్ వరకు సుందరీకరణ పనులు పూర్తి చేశారు. అక్కడ డివైడర్లను నిర్మించడంతో పాటు సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. మొక్కలు కూడా నాటారు. కానీ నిత్యం వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో రద్దీగా ఉండే దేవీచంద్ చౌక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు డివైడర్లను నిర్మించి వదిలేశారు. సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసినప్పటికీ పచ్చదనాన్ని విస్మరించారు. మూడేళ్లు గడుస్తున్నప్పటికీ అందులో ఇప్పటి వరకు మొక్కలు నాటలేదు. ఇక శివాజీచౌక్ నుంచి ఠాకూర్ హోటల్ వరకు నిర్మించాల్సిన డివైడర్లను సగానికే పరిమితం చేశారు. ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట నుంచి పాత జాతీయ రహదారి వరకు గల ప్రాంతంలో డివైడర్‌ను నిర్మించినప్పటికీ అందులోనూ మొక్కలు నాటలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో సుందీరకరణ సుదూరంగా నిలిచి బల్దియా నిర్వాకాన్ని స్పష్టం చేస్తోంది. కోట్లాది రూపాయలతో చేపట్టిన పనులను అర్ధంతరంగా నిలిపివేయడంతో ప్రజాధనం వృథా అయిందే తప్ప పట్టణ సుందీకరణ పూర్తి స్థాయిలో జరుగలేదు.

నిర్వహణ లోపం..

అంబేద్కర్‌చౌక్ నుంచి దేవీచంద్ వరకు గల డివైడర్లు అస్తవ్యస్తంగా మారాయి. బల్దియా అధికారుల నిర్వహణ లోపం, కాంట్రాక్టర్ నాసిరకంగా చేపట్టిన పనులతో పలు చోట్ల నిర్మాణాలు కూలిపోతున్నాయి. దానికి ఇరువైపులా ఉన్నటువంటి వీధి వ్యాపారులు డివైడర్‌పైనే చెత్తను పడేస్తుడటంతో పచ్చని మొక్కలతో కనిపించాల్సిన డివైడర్లు చెత్తచెదారంతో దర్శనమిస్తున్నాయి. ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట కూడా ఇదే పరిస్థితి. నిర్మాణాలను చేపట్టి ఏళ్లు గడుస్తున్నా.. వాటిల్లో ఒక మొక్క కూడా నాటలేదు. ఆదిశగా అధికారులు దృష్టి సారించిన పాపాన పోలేదు. పలుచోట్ల గోడలు పలిగిపోయి కనిపిస్తున్నాయి. శివాజీచౌక్ నుంచి ఠాకూర్ హోటల్ వెళ్లే మార్గంలో, అంబేద్కర్‌చౌక్ నుంచి శివాజీచౌక్ వెళ్లే మార్గంలోనూ పలు చోట్ల డివైడర్లు ధ్వంసమయ్యాయి. వీటి పరిస్థితి ఇలా ఉంటే వివేకానంద చౌక్ నుంచి నేతాజీచౌక్ వెళ్లే మార్గంలో టీఎన్జీవోస్ భవన్ సమీపంలో నాటిన మొక్కలు రక్షణ చర్యలు లేకపోవడంతో కనుమరుగయ్యాయి. చర్యలు చేపట్టాల్సిన బల్దియా అధికారులు తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా.. స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: 18 ఏళ్లు నిండని వారికి వాహనాలను ఇవ్వద్దని, ఇస్తే కేసులు నమోదు చేస్తామని ఏఎస్సై భీంరావ్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద పని చేస్తున్న కార్మికులకు అవగాహన కల్పించారు. అలాగే మద్యం తాగి వాహనాలను నడపవద్దన్నారు. చట్టాలను ఉల్లంగిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం మనమందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ చరణ్‌దాస్, ప్రకాష్‌రెడ్డి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం



మరమ్మతుల పనులు పరిశీలిస్తున్న డీఈ సుభాష్

ఇంద్రవెల్లి: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ డీఈ జాదవ్ సుభాష్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన విద్యుత్ మరమ్మతులు పనులు పరిశీలించారు. ఈసందర్భంగా విద్యుత్ శాఖ మండల అధికారులతో మాట్లాడి మండల కేంద్రంలో,గ్రామాల్లో విద్యుత్ సమస్య రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడక్కడ సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ మండల ఏఈ రోహిదాస్, లైన్‌మెన్‌లు దుర్గరాజ్, జూనియర్ లైన్ మెన్ మెస్రం మానిక్‌రావ్ పాల్గొన్నారు.

బౌద్ధబంతే మృతి సమాజానికి తీరని లోటు



నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

ఇంద్రవెల్లి: మహాథేరో పూజ్య బంతే సుమేద్ బోధి మృతి చెందడం సమాజానికి తీరని లోటు అని మహామాయా ఉపాసిక సంఘం మండల అధ్యక్షురాలు సోమోరే మాయాబాయి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మిలింద్‌నగర్ కాలనీలో మహాథేరో బంతే సుమేద్ బోధి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో బౌద్ధ ధర్మన్ని వ్యాప్తి చేసేందుకు ఎనలేని కృషి చేశాడని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కాంరాజ్, మస్కే రాజువర్ధన్, గోపనే ఆనంద్‌రావ్, ప్రభావతి, లత, దుర్పత, మాయావతి, ముక్రన్ బాయి పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదు'



మాట్లాడుతున్న నగేశ్

ఆదిలాబాద్: ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను విమర్శించే స్థాయి డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డికి లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్రాల నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అవినీతి పరుడైన మున్సిపల్ వైస్ చైర్మన్‌ను గద్దె దించడమే లక్ష్యంగా బీజేపీ కృషి చేస్తుందన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో వైస్ చైర్మన్ ఏకచత్రాధిపత్యం కొనసాగుతుందన్నారు. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు మాజీమంత్రి జోగు రామన్న మౌత్ పీస్‌గా వ్యవహరించిన భోజా రెడ్డి ప్రస్తుతం కాంగ్రెస్ నేత కంది శ్రీనివాస్ రెడ్డికి మౌత్ పీసుగా మారారని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు జోగు రవి, దినేష్ మటోలియా, దయాకర్, ఘటిక క్రాంతికుమార్ పాల్గొన్నారు.

కూలిన ఆలయ ప్రహరీ



కూలిన గోడ ఇదే..

ఇచ్చోడ: మండలంలోని అతిపురాతనమైన మల్లికార్జున ఆలయ ప్రహరీ శనివారం ఉదయం కూలిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆలయ ప్రహరీ వెనుక భాగం కూలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రహరీ పునఃనిర్మాణం కోసం భక్తులు ముందుకు రావాలని గ్రామస్తులు కోరారు.

లంబాడా ఐక్యవేదిక కోఆర్డినేటర్‌గా అరవింద్



అరవింద్

బోథ్: గిరిజన లంబాడా ఐక్యవేదిక బోథ్ మండల కోఆర్డినేటర్‌గా సూర్యనగర్ గ్రామానికి చెందిన జాదవ్ అరవింద్ నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మండల కో ఆర్డినేటర్ పదవీ కట్టబెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన లంబాడాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ జాదవ్ రమేశ్, జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నాగాపూర్‌లో వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

బోథ్: వర్షాకాలంలో రోగాలు ప్రబలే అవకాశం ఉండడంతో మండలంలోని నాగాపూర్ గ్రామంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. దగ్గు, జ్వరంతో పాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాంసి, భీంపూర్‌లో వర్షం



తాంసిలో కురుస్తున్న వర్షం

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని గ్రామాల్లో శనివారం వర్షం కురిసింది. దీంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. వర్షంతో రైతులు పంటచేల నుంచి ఇళ్లకు తిరిగి రావాల్సి వచ్చింది. సాగుచేసిన పత్తి, సోయా, కంది పంటలకు అనుకూలంగా వర్షాలు కురియడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సువర్ణలత బదిలీ కావడంతో ఆమెను అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఘనంగా సన్మానించారు. మెదక్ జిల్లాలోని హెడ్ క్వార్టర్‌కు ఆమె బదిలీ అయ్యారు. కాగా 14 సంవత్సరాల క్రితం పాఠశాలకు వచ్చిన ఆమె పాఠశాలను ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఆమె సేవలు మరువలేవని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

గ్రామాల్లో మొహర్రం వేడుకలు



బోథ్: కౌఠ(బి)లో కొలువుదీరిన పీరీలు



ఇంద్రవెల్లి: దోలను అలంకరిస్తున్న యువత

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని భగత్‌సింగ్‌నగర్, గొండ్‌గూడ, వడగామ్, వాల్గోండ, కైలాస్‌నగర్, ముత్నూర్, దనోరా(బి), గౌరపూర్, అంజీ గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం పీరీలు, డోలలకు అలంకరించే పనుల్లో భక్తులు నిమగ్నమయ్యారు. ఆదివారం పీరీల ఊరేగింపు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు. మొహర్రం ఉత్సవాలు ఈనెల 18 వరకు కొనసాగుతాయన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు సొనాల, కౌఠ(బి), పొచ్చెర, ధన్నూర్, కనుగుట్ట, మర్లపెల్లి గ్రామాల్లో పీరీలకు గ్రామస్తులు పూజలు చేశారు. 10 రోజుల పాటు మొహర్రం వేడకలు జరగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



చెక్‌డ్యాం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని రాజుర గ్రామానికి వెళ్లే లోలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులతో పాటు గ్రామంలో చేపడుతున్న పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే మండలంలోని కొర్టికల్ శివారులో నూతనంగా చేపట్టిన చెక్‌డ్యాం పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టాలని పేర్కొన్నారు. ఆయన వెంట మండల నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని బందం గ్రామంలో గల మాజీ సర్పంచ్‌రెడ్డి కుటుంబసభ్యులతో పాటు పాషతండా గ్రామానికి చెందిన సుమిత్ర గాయపడ్డారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారిని పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, డీసీసీబీ జిల్లా మాజీ డైరెక్టర్ జాదవ్ గణేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్ సింగ్, ప్రతాప్ సింగ్ ఉన్నారు.

నత్తనడకన ఫ్లైఓవర్ పనులు



అసంపూర్తిగా పనులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని దుబార్‌పేట్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు అవుతున్నా.. పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. దీంతో దుబార్‌పేట్ గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ ఏటా వర్షాకాలం వంతెన కింది నుంచి దుబార్‌పేట్ గ్రామంలోని వరదనీరు చేరుతోంది. వారి ఇళ్లలో ఉన్న వస్తువులు తడిసి ముద్దాయిపోతాయి. గతంలో కలెక్టర్ గ్రామస్తులుతో మాట్లాడి ఫ్లైఓవర్ వంతెనను పరిశీలించి వరద నీరు ఇళ్లలోకి చేరకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ వంతెనకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం, మరోవైపు వరద నీరు గ్రామంలోకి వెళ్లకుండా గోడ నిర్మించాలి. కానీ గోడను నిర్మించిన ఫ్లైఓవర్ కింద ఒక్కదిక్కు మాత్రమే డ్రెయినేజీ పనులు పూర్తయ్యాయి. మరోవైపు గత కొంత కాలంగా నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఈఏడాది భారీ వర్షాలు కురిస్తే దుబార్‌పేట్‌లో వరదనీరు చేరే అవకాశం లేకపోలేదు. సంబంధిత కాంట్రాక్టర్ స్పందించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి



డీఎస్పీతో మాట్లాడుతున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: బంగారిగూడలో దళితులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు అల్లూరి భూమన్న అన్నారు. శనివారం ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారిగూడకు చెందిన మోరే సూర్యకాంత్, ఆయన కుటుంబీకులపై రౌడీ మూకలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని అన్నారు. ఈ నెల 10న బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా.. ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయలేదన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. దళిత సంఘాల నాయకులు నవీన్, దయాకర్, సందీప్, బాలాజీ, నాందేవ్, సూర్యవర ప్రసాద్, ఊషన్న, సత్యనారాయణ, దేవిదాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న భాషాపండితులు, పీఈటీలు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వానికి రుణపడి ఉంటామని భాషాపండితులు, పీఈటీలు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని ఓ హోటల్‌లో భాషాపండితులు కృతజ్ఞత సభ నిర్వహించగా, కాంగ్రెస్ అధికార ప్రతినిధి, మేనిఫెస్టో సభ్యుడు, పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, భాషా పండితుల సంఘం అధ్యక్షుడు భవాని వివేకానంద, భాషా పండితులు ఆశన్న, గిరిధర్, మోహన్‌రావు, జావిద్, భాస్కర్‌రెడ్డి, విఠల్, అర్చన, పుష్పలత, పీఈటీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

పట్టణంలో శనివారం పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, కేజీబీవీ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్‌సింగ్, నవీన్ యాదవ్, సంఘ బాధ్యులు జాదవ్ ప్రకాశ్, సునీల్, దినేశ్, ముజీబ్, బాబన్న, రాజు, మోహన్‌సింగ్ తదితరులున్నారు.